శిథిలావస్థలో పాపన్న దర్బార్

- పట్టించుకోని పాలకులు
- పునరుద్ధరణకు నోచుకోని తాటికొండ దర్బార్
- కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా దశ మారేనా..
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రజల డిమాండ్


తాటికొండ దర్బార్ గడీ గోడలు


దర్బార్ వద్ద బురుజు


తాటికొండ ఖిలా

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ గ్రామంలో సర్దార్ సర్వాయ్ పాపన్న దర్బార్ శిథిలావస్థకు చేరుతోంది. పాలకుల నిర్లక్ష్యంతో చారిత్రాత్మక కట్టడమైన పాపన్నదర్బార్ నిరాదరణ గురవుతోంది. వివరాలు ఇలా ఉన్నాయి. బహుజన వీరుడు సర్దార్ సర్వాయ్ పాపన్న గోల్కొండ కోటపై జెండా ఎగురవేసిన వీరుడు. ఆయన నిర్మించిన కట్టడాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంటూ ఒక్కొక్కటిగా కాలగర్భంలో కలిసిపోతున్నాయి. నియోజకవర్గంలోని రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్‌లో సర్వాయ్ పాపన్న కోట మూడేళ్ల క్రితం కూలిపోవడంతో ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయించగా పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. కాగా, మండలంలోని తాటికొండలో పాపన్న నిర్మించిన దర్బార్ శిథిలావస్థకు చేరి బురుజు నిర్మించిన మట్టి గోడలు కూలిపోయేలా ఉన్నాయి. చారిత్రాత్మక కట్టడమైన తాటికొండ దర్బార్‌ను పునరుద్ధరించి అభివృద్ధి పనులు చేపట్టి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

శత్రు దుర్భేద్యమైన కట్టడాలు

క్రీ.శ. 1650లో జన్మించిన సర్దార్‌సర్వాయ్ పాపన్న క్రీ.శ. 1687–1724 కాలంలో మొగల్ చక్రవర్తులకు వ్యతిరేకంగా పోరాడి బహుజన నాయకుడిగా పేరు గాంచాడు. మొగల్ పాలకులు, జమీందార్లు, భూస్వాముల నుంచి పేదలు, సామాన్య ప్రజల్ని కాపాడేందుకు గెరిల్లా సైన్యం కోసం ఖిలాషాపూర్, తాటికొండ గ్రామాల్లో కోటలు, దర్బార్‌ల పేరిట శత్రు దుర్భేద్యమైన కట్టడాలను నిర్మించారు. శత్రు సైన్యాన్ని ముప్పుతిప్పలు పెట్టి ఓటమి ఎరుగని పోరాటాలు చేస్తూ గోల్కొండకు రాజు అయ్యాడు. ఈ క్రమంలో నిర్మించిన కోటగోడలు, దర్బార్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. గత ప్రభుత్వంలో పాలకులు దర్బార్‌ను పట్టించుకోలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు తాటికొండలో సర్వాయ్ పాపన్న నిర్మించిన బురుజులు, దర్బార్‌లు విషయమై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

మూడేళ్ల క్రితం పరిశీలించిన పురావస్తు శాఖ అధికారులు

తాటికొండ దర్బార్, ఖిలాగుట్టపై ఉన్న ఆలయానికి మరమ్మతులు చేసేందుకు మూడేళ్ల క్రితం పురావస్తు శాఖ అధికారులు తాటికొండలో దర్బార్‌ను, కట్టడాలను పరిశీలించారు. దాంతో త్వరలో తాటికొండలోని సర్దార్ సర్వాయ్ పాపన్న నిర్మించిన పురాతన దర్బార్ దశ మారనుందని స్థానికులు సంబురపడ్డారు. అయితే ఇంతవరకూ అతీగతీ లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి తాటికొండ దర్బార్‌ను పర్యాటక కేంద్రంగా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలి



తాటికొండలోని సర్వాయ్ పాపన్న దర్బార్ పునరుద్ధరణ పనులకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి. చారిత్రాత్మకమైన దర్బార్, బురుజులు, ఖిలాగుట్టపై ఉన్న ఆలయానికి పునరుద్ధరణ పనులు చేపట్టి పర్యాటక కేంద్రంగా చేపట్టాలి. గడిగోడల్లో పల్లెప్రకృతివనం ఏర్పాటు చేసి పార్కును ఏర్పాటు చేశాం. ప్రభుత్వం, సంబంధిత అధికారులు తాటికొండ దర్బార్ విషయమై ప్రత్యేక దృష్టి సారించాలి.

– చల్లా సుధీర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ

క్లుప్తంగా

నియామకం



రఘునాథపల్లి: కాంగ్రెస్ మత్స్యకారుల సెల్ మండల అధ్యక్షుడిగా మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన పులి కార్తీక్‌ను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి చేతుల మీదుగా నియామక ఉత్తర్వులను కార్తీక్ అందుకున్నారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు మత్స్య కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాననాన్నరు. తన నియమానికి సహకరించిన టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర, జిల్లా, మండల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు పోకల శ్రీనివాస్, ఎండీ గౌస్, గ్యార అయిలయ్య, చింత నరేష్, మేడిపల్లి నరేష్, నోముల సత్తయ్య పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మనోజ్‌రెడ్డి



చిల్పూరు: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో చిల్పూరు మండలం శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన పార్టీ నియోజకవర్గం కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పార్టీ బలోపేతం కోసం కృషిచేయాలని కేటీఆర్ సూచించినట్లు చెప్పారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన



పాలకుర్తి: మండలంలో కొత్తగా మంజూరైన పోలింగ్ కేంద్రాలను శనివారం సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై సాయిప్రసన్న సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు.

కాంగ్రెస్‌లో చేరిక



తరిగొప్పుల: మండలకేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, ప్యాక్స్ డైరెక్టర్ అర్జుల సుధాకర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పండుగ కనుకయ్య ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు మంద చంద్రయ్య, ఎర్రవెల్లి పోషయ్య, పింగిళి ఇంద్రారెడ్డి, సిరిగిరి దాసు, ల్యాగల అంజయ్య,గోరంతల వీరన్న, గాలి ఐలయ్య పాల్గొన్నారు.

మెజార్టీలో పాలకుర్తి అగ్రభాగాన నిలవాలి

కొడకండ్ల: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు భారీ మెజార్టీని అందించి పాలకుర్తి నియోజకవర్గాన్ని మెజార్టీలో అగ్రభాగాన నిలుపాలని రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య కోరారు. శనివారం మొండ్రాయి గ్రామానికి విచ్చేసిన రాజయ్య కాంగ్రెస్ శ్రేణులతో పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాజయ్యను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, మహిళ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ రోజా, నాయకులు పాల్గొన్నారు.

'కడియం కావ్యను ఓడించాలి'



రఘునాథపల్లి: బీఆర్‌ఎస్‌లో అనేక పదవులు అనుభవించి స్వార్థ ప్రయోజనం కోసం కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరికి గుణపాఠం చెప్పేందుకు పార్లమెంట్ ఎన్నికల్లో అతని కూతురు కావ్యను చిత్తుగా ఓడించాలని బీఆర్‌ఎస్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కొడిదేటి శంకర్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని ఖిలాషాపూర్, మండలగూడెం, జాఫర్‌గూడెంలో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై బూత్ కమిటీలు వేశారు. నేడు వరంగల్ రానున్న మాజీ సీఎం కేసీఆర్ బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ మండల కోఆర్డినేటర్ తిప్పారపు రమ్య, నాయకులు ముసిపట్ల రాజు, చింతల బాలకృష్ణ, కావటి యాదగిరి, శ్రీహరి, ఎండీ గౌస్, శ్రీనివాస్, వెంకటయ్య, కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలు వినియోగించుకోవాలి


దేవరుప్పుల: ఈసీసీఈ డేలో చిన్నారులు

దేవరుప్పుల: పుట్టిన ప్రతి శిశువు అభ్యున్నతి కోసం పాటుపడే అంగన్‌వాడీ కేంద్రాల సేవలను అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి సూచించారు. శనివారం మండలంలోని సింగరాజుపల్లి అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే తలపించేలా ఈసీసీఈడేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదేళ్లు నిండి ఓనమాలు నేర్చుకున్న చిన్నారులకు ప్రాథమిక పాఠశాల ప్రవేశ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు రేణుక,శ్రీలత, మంగ, ఆరోగ్య సిబ్బంది లక్ష్మి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: పిల్లల విద్యాభివృద్ధికి అంగన్‌వాడీలు దోహదం చేస్తాయని ఐసీడీఎస్ సూపర్ వైజర్ టి.అనిత పేర్కొన్నారు. మండలంలోని జఫర్‌గఢ్, హిమ్మత్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో స్కూల్ డే కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ అనిత మాట్లాడుతూ పిల్లల్లో శారీరక ఎదుగుదలతో పాటు వారికి ఇష్టమైన పద్ధతిలో విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అంగన్‌వాడీ టీచర్లు అమృత, రాజకళ, సోమలక్ష్మి, ఉమా, నాగమణి, రాజేశ్వరి, చిలుకమూరి విజయలక్ష్మి తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: మండలంలోని కోమల్ల అంగన్‌వాడీ –1 కేంద్రాలో గ్యాడ్యుయేషన్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ బి. ప్రేమలత పౌష్టికాహారం, పోషక విలువలపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి త్రివేణి, అయా ఎన్ లక్ష్మి పాల్గొన్నారు.

ఇంటర్‌తో ఉజ్వల భవిష్యత్‌కు పునాది


ర్యాంకులు సాధించిన విద్యార్థులు

దేవరుప్పుల: ఇంటర్మీడియట్‌తో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు పడుతాయని కరస్పాండెంటు బ్రదర్ జేసురాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఇటీవల ఇంటర్ ప్రథమ, ద్వితీయ విభాగాల్లో అత్యుత్తమ రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన స్నేహిత, శివగణేష్ శ్రీకాంత్, రోహిత్, హర్షిత్, దుర్గప్రసాద్ తదితర విద్యార్థులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్‌లో నిర్లక్ష్యం చేసే విద్యార్థులు తమ నిండు జీవితాన్ని నాశనం చేసుకున్నవారవుతారన్నారు. నచ్చిన విభాగాల్లో రాణించి ఉన్నత విద్యలో అగ్రభాగాన నిలిచి తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు మదన్‌మోహన్, ఖాజా, మహేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థిని గెలిపించండి


మాట్లాడుతున్న ఎండీ అబ్బాస్

జనగామ రూరల్: నిజాయితీగా పని చేసే సీపీఎం అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రచారం చేపట్టాలని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు ఎండీ అబ్బాస్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయంలో మోకు కనకారెడ్డి అధ్యక్షత నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టుల కంచుకోట అయిన భువనగిరిలో పార్టీ అభ్యర్థి జహంగీర్ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఉపేందర్, వెంకటేష్, వెంకటమల్లయ్య, రాములు, ఎల్లయ్య, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవం


బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న మహిళలు

దేవరుప్పుల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఇంటింటా ఆడపడుచులు మండుటెండల్లోనూ కాలికి చెప్పులు లేకుండా భక్తిప్రపత్తులతో శనివారం నెత్తిన అలంకరించిన రాగిపాత్రలో నీళ్లు తెచ్చి ఘనంగా జలాభిషేకం చేశారు. అలాగే గౌడ సామాజిక వర్గం ఇలవేల్పు కంఠమహేశ్వరస్వామి విగ్రహప్రతిష్ఠాపన ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా గీత కార్మికుల కుటుంబాలు జలకడువలతో స్వామి విగ్రహాలకు జలాభిషేకం నిర్వహించారు. యాదవ, ముదిరాజ్ తదితర సామాజిక వర్గాలు తమ ఇలవేల్పు దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఊరంతా ఆడపడుచుల రాకతో సందడిగా నెలకొంది.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై నరేష్

రఘునాథపల్లి: మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ రహదారిలో లయన్స్ క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. రఘునాథపల్లి ఎస్సై దూదెమెట్ల నరేష్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు పండి శంకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ ఫ్రీజర్ (చలివేంద్రం)ను ప్రజలకు అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. చల్లని తాగునీరును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. చలివేంద్రం ఏర్పాటు చేయడంపై స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ పూర్వ జోన్ చైర్మన్ గంధ్ర శ్రీకాంత్, సభ్యులు కందుల అనిల్‌కుమార్, ప్రదీప్‌కుమార్, రాజు, కడారి శ్రీనివాస్, మునిరాజ్, త్రిసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు వైభవంగా బోనాలు


బోనాలతో వెళ్తున్న మహిళలు

బచ్చన్నపేట: కట్కూర్ గ్రామంలో దుర్గామాతకు గ్రామస్తులు బోనాలు సమర్పించారు. శనివారం దుర్గామాత ఉత్సవాల్లో భాగంగా బోనాలతో శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్లతో ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి దుర్గామాత కల్యాణం నిర్వహించారు. గ్రామంలో అల్లర్లు జరుగకుండా ఎస్సై కంకల సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశా రు. ఎంపీపీ బావండ్ల నాగజ్యోతికృష్ణంరాజు, మాజీ సర్పంచ్ మూసిని సునీతరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఈఈ మంగీలాల్

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను ఇరిగేషన్ ఈఈ మంగీలాల్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతతో చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. మండల నోడల్ అధికారి డీపీఎల్‌ఎన్ మూర్తి, ఏఈ హన్మంతు, ఎంపీడీఓ రఘురామకృష్ణ, పలువురు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు


మాట్లాడుతున్న ఎంపీపీ జయశ్రీ

లింగాలఘణపురం: వేసవిలో మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎంపీపీ చిట్ల జయశ్రీ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా వేసి వేసవిలో తాగునీటిపై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. చీటూరు, క్లాం, సిరిపురంలో కొంత తాగునీటి సమస్య ఉందని, చీటూరులో ఎస్సీ కాలనీలో ట్యాంకర్‌తో నీటి సరఫరా చేయడం జరుగుతుందని, సిరిపురంలో బోరులలో భూగర్భ జలాలు అడుగంటడంతో ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందని, బోర్లను ఫ్లెసింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, క్లాంలో బోరు అద్దెకు తీసుకొని నీటి సమస్యను తీర్చేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. వేసవిలో సైతం మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా అవుతుందని, చిన్నచిన్న సమస్యలను పరిష్కరించి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, ఎంపీఓ మల్లికార్జున్, ఎంపీటీసీలు బిక్షపతి, మాధవి, సోమలక్ష్మి, కోఆప్షన్ జానీపాషా, స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


నర్మెట: పరామర్శిస్తున్న నాగపురి కిరణ్ కుమార్


రఘునాథపల్లి: ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు


స్టేషన్‌ఘన్‌పూర్: ఆర్థికసాయం అందజేస్తున్న సత్యం తదితరులు

నర్మెట: మండలంలోని మచ్చుపహాడ్‌కు చెందిన కొంపెల్లి మైసయ్య శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. కాగా, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ రూ. 10 వేలు, జిల్లా కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి రూ.5 వేలు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, పార్టీ ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి రూ.10 వేలు పార్టీ శ్రేణులతో కలిసి శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా మైసయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, చెవుల పరశురాములు, కూకట్ల చంద్రమౌళి, గొల్లపల్లి కుమార స్వామి, ప్రజ్ఞాపురం శ్రీధర్, సరాబు మధు, బీఆర్‌ఎస్ నాయకులు తాజా మాజీ సర్పంచ్ రామిని శిరాజ్ గుప్తా, కొంపెల్లి రాజు, గుండేటి రాంచందర్, రాజశేఖర్, గజ్జెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

రఘునాథపల్లి: మండలంలోని కోడూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండ కొమురయ్య (68) అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ మారుజోడు రాంబాబు శనివారం స్థానిక మాజీ సర్పంచ్ జోగు గట్టయ్య, గొరిగ భాస్కర్‌లతో రూ.5 వేల ఆర్థిక సాయం పంపించారు. పలువురు కాంగ్రెస్ నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు కోళ్ల రవిగౌడ్, శాగంటి అంజయ్య, మడికంటి కరుణాకర్, పూజారి మధుసూదన్, కొలుపుల భిక్షపతి, దాసరి నరసింహులు, దాసరి లచ్చయ్య, మోహన్ తదితరులు నివాళులర్పించారు.

బాల్య స్నేహితుల చేయూత

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లికి చెందిన కుక్కల సారయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, అతడితో కలిసి చదువుకున్న 1991–92 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్‌కి చెందిన బాల్య స్నేహితులు తమవంతుగా బాధిత కుటుంబానికి చేయూతను అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ మేరకు గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ తోట సత్యం ఆధ్వర్యంలో బాల్య స్నేహితుల చేయూతతో సేకరించిన రూ.16,300 మొత్తాన్ని శనివారం మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ముందుగా సారయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రగాఢ సంతాపం తెలిపారు. తమ బాల్య స్నేహితుడు మృతిచెందడం ఎంతో బాధాకరమన్నారు. కార్యక్రమంలో బోనగిరి విద్యాసాగర్, గట్టు మనోహర్‌బాబు, తోట సత్యనారాయణ, ఆనందం, శాగ శ్రీనివాస్, ఉప్పలయ్య, గట్టు రాజు, చిక్కుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

చిల్పూరు: హనుమకొండలో నేడు నిర్వహించనున్న మాజీ సీఎం కేసీఆర్ రోడ్ షోకు పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎడవెల్లి కృష్ణారెడ్డి కోరారు. మండలంలోని పలుగ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కార్యదర్శి జనగామ యాదగిరి అధ్యక్షతన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ గెలుపే లక్ష్యంగా నేడు (ఆదివారం) మాజీ సీఎం కేసీఆర్ రోడ్ షోలో పాల్గొనేందుకు వస్తున్నందున కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు మాలోత్ రమేష్, కేశిరెడ్డి రాకేష్‌రెడ్డి, ఉద్దెమారి రాజ్‌కుమార్, ఎడ్ల శ్రీను, చొక్కయ్య, ఊమ్లా, మచ్చ మల్లేషం, శంకర్, మోహన్, నవీన్, నాగేందర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: హనుమకొండలో నేడు నిర్వహించనున్న బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రోడ్ షోకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్ కోరారు. కేసీఆర్ రోడ్ షోను జయప్రదం చేసేందుకు గాను మండలంలోని వివిధ గ్రామాల్లో బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో శనివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామశాఖ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. నాయకులు జక్కుల పరశురాములు, ఎన్నకూస రాంనర్సయ్య, రత్నాకర్‌రెడ్డి, నర్సింహరాములు, బొంకూరి మహేష్, మహేందర్, బాబు, మైబుపాషా, మంద రాకేష్, మదర్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

చిల్పూరు: గ్రామీణ ప్రాంతాల్లోని పేదల ఆరోగ్యం కోసం సెనెర్జియా గ్రూపు స్వచ్ఛంద సంస్థ వైద్య శిబిరాలను ఏర్పాటు చేయించడం అభినందనీయమని చిల్పూరు ఆలయ శాశ్వత అభివృద్ధి దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు అన్నారు. మండలంలోని పల్లగుట్ట గ్రామంలోని జీపీ కార్యాలయం ఆవరణలో శనివారం సంస్థ నిర్వాహకులు జీడీ జాన్, డాక్టర్ చిర్ర సుమన్‌ల ఆధ్వర్యంలో మెడికేర్ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య, రక్తదాన శిబిరాన్ని శ్రీధర్‌రావు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్లు రాము, సురేష్, కార్యదర్శి బాపునాయక్, కొయ్యడ శోభారాణి, రత్నాకర్‌రెడ్డి, జీడీ ఆనందం, వేల్పుల గట్టేష్ గ్రూపు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

బచ్చన్నపేట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటర్లకు స్లిప్పులు అందజేయడం జరుగుతుందని తహసీల్దార్ విశాలాక్షి అన్నారు. శనివారం మండలంలోని ఇటుకాలపల్లి గ్రామంలో ఇంటింటా తిరుగుతూ ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. ఎంఆర్‌ఐ శ్రీనివాస్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

మొక్కలను రక్షించాలి

మొక్కలను రక్షించి పర్యావరణాన్ని కాపాడాలని తమ్మడపల్లి పంచాయతీ కార్యదర్శి సౌజన్య అన్నారు. శనివారం గ్రామంలో వన నర్సరీ, పల్లె ప్రకృతి వనం, రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీటిని పట్టించారు. అనంతరం ఆమె మాట్లాడారు. నాగయ్య, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం


కళారంగ శ్రేణుల తోడ్పాటు అభినందనీయం

దేవరుప్పుల: పద్మశ్రీ పురస్కారం తనకు లభించేందుకు కళారంగ శ్రేణుల తోడ్పాటు అభినందనీయమని అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య అన్నారు. శనివారం మండలంలోని అప్పిరెడ్డిపల్లెకు జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి, సీనియర్ నాయకుడు లంకల దీపక్‌రెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా పద్మశ్రీ పురస్కారం లభించేలా కేంద్రంస్థాయిలో విస్తృత సహకారాలు అందించినందుకు ఆయనను సమ్మయ్య ఘనంగా సత్కరించారు.

గుండెపోటుతో బీఆర్‌ఎస్ నాయకుడి మృతి

మండలంలోని నీర్మాల ఎంపీటీసీ మేడ కళ్యాణి భర్త, బీఆర్‌ఎస్ మండల నాయకుడు మేడ వెంకటేశ్వర్లు(35) గుండెపోటుతో శనివారం హఠాన్మరణం పొందారు. వెంకటేశ్వర్లు మృతి పట్ల మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఫోన్‌లో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అలాగే పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



బచ్చన్నపేట: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాల పాలైన సంఘటన మండలంలోని అలింపూర్, వంగ సుదర్శన్‌రెడ్డి నగర్ గ్రామాల మధ్య గల పెసరుబండల వద్ద శనివారం రాత్రి జరిగింది. ఎస్సై కంకల సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం యాసోజిగూడెం గ్రామానికి చెందిన నాలోజు తిరుమలచారి, అతని భార్య వీరమణి(40) దంపతులు బైక్‌పై సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూర్ గ్రామంలోని దుర్గామాత పండుగకు బంధువుల వద్దకు వెళ్తున్నారు. ఈక్రమంలో పెసరు బండల వద్ద గుర్తు తెలియని వాహనం వారి బైక్‌ను ఢీకొనడంతో వీరమణి అక్కడికక్కడే మృతి చెందగా తిరుమలచారికి కాలు విరిగి తీవ్రగాయాలు కాగా, 108లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలం వద్దకు ఎస్సై సతీష్‌కుమార్ చేరుకొని మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.